## క్లుప్తంగా

### మావుళ్లమ్మకు ఆషాఢం సారె సమర్పణ



మావుళ్లమ్మకు సారె సమర్పిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: స్థానిక బంగారువారి చెరువుగట్టులో వేంచేసియున్న మావుళ్లమ్మకు శనివారం ఆషాఢం సారె సమర్పించారు. పట్టణానికి చెందిన ముత్తైదువలు అమ్మవారికి సమర్పించే స్వీట్లు, పండ్లతో ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారికి సుమారు 150 కిలోల స్వీట్లుతో నైవేద్యంగా సమర్పించారు. మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ కర్నేన రోజారమణి, కర్నేన గౌరునాయుడు, ఆలయ కమిటీ అధ్యక్షుడు శంకరాపు శ్రీనివాసరావు, రౌతు అచ్చుతరావు, కనమర్లపూడి వెంకన్న, కట్టా శ్రీను, గమిని ప్రసాద్, కడలి నాగరాజు, భక్తులు పాల్గొన్నారు.

### చట్టాలపై విస్తృతంగా సదస్సులు



మాట్లాడుతున్న జడ్జి విజయదుర్గ

నరసాపురం: చట్టాలపై అవగాహన కల్పించేందుకు ఆగస్టు నెలంతా మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విస్తృతంగా అవగాహనా సదస్సులు నిర్వహించాలని నరసాపురం 10వ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ పి.విజయదుర్గ ఆదేశించారు. శనివారం నరసాపురం, మొగల్తూరు, పాలకొల్లు, యలమంచిలి మండలాలకు సంబంధించిన న్యాయసేవా సంస్థ నామినేటెడ్ సభ్యులు, ప్యానల్ లాయర్లు, పారా లీగల్ వలంటీర్లతో కోర్టు హాల్‌లో ఆమె సమావేశం నిర్వహించారు. వితంతువులకు ప్రభుత్వం ఇచ్చే పింఛన్ పథకం, మాదకద్రవ్యాల నిరోధకచట్టం, మానసిక వికలాంగుల పథకాలపై ప్రజలకు ఏ విధంగా అవగాహన కల్పించాలనే అంశంపై చర్చించారు. కళాశాలల యాజమాన్యాలు, విద్యార్థులతో కలసి మాదకద్రవ్యాల నిరోధక చట్టంపై అవగాహనా ర్యాలీలు నిర్వహించాలన్నారు.

### వరద బాధితులను ఆదుకుంటాం



రైతులకు పశువుల దాణా పంపిణీ చేస్తున్న మంత్రి రామానాయుడు

యలమంచిలి: వరద బాధితులను అన్ని విధాలుగా ఆదుకుంటామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. అబ్బిరాజుపాలెం, గంగడుపాలెం గ్రామాల్లో శనివారం ఆయన పాడి రైతులు పశువుల దాణా పంపిణీ చేశారు. వరద ప్రభావిత గ్రామాల్లో బియ్యం, నిత్యావసర సరుకులు అందించడంతోపాటు ఇళ్లలోనికి నీరు వెళ్లిన వారికి రూ.3 వేలు ఇచ్చినట్టు మంత్రి చెప్పారు.

### నూకాలమ్మ వెండి చీర తయారీకి విరాళాలు



భీమవరం: భీమవరం 33వ వార్డులో వేంచేసియున్న నూకాలమ్మవారికి వెండి చీర తయారు చేసేందుకు పట్టణానికి చెందిన సరిపిడకల రామకృష్ణ, అనంత లక్ష్మి దంపతులు రూ.10 వేలు, హైదరాబాద్‌కు చెందిన యడ్ల కామేశ్వరరావు- విజయలక్ష్మి దంపతులు రూ.9 వేలు, సిరియాల శివశంకర్, శ్రీదేవి దంపతులు రూ.5వేలు విరాళంగా అందించారు. కమిటీ సభ్యులు రౌతు అప్పారావు, మెట్టా మురళీకృష్ణ, సిరియాల నాగేశ్వరావు, రౌతు హరిబాబు, తాళ్లపూడి పరమేశ్వరరావు పాల్గొన్నారు.

# లంక గ్రామాల్లో నిలిచిన బురద

- కానరాని బురద తొలగింపు చర్యలు
- ప్రజలకు అవస్థలు

పెనుగొండ: గోదావరి వరద ఉగ్రరూపం తగ్గడంతో లంక గ్రామాల్లో ఎక్కడికక్కడ బురద నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నివాస ప్రాంతాల్లో బురదను తొలగించడానికి అధికారులు ఎటువంటి ఏర్పాట్లు చేయలేదు. దీంతో ప్రజలు ఎవరికి వారే స్వయంగా కొన్ని ప్రాంతాల్లో బురదను రోడ్డుపై నుంచి తొలగించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేసుకొన్నారు. దీనికి తోడు రెండురోజులు ఎండ తీవ్రత ఉండడంతో కొద్దిపాటి ఉపశమనం కలిగింది. సిద్ధాంతం కేదారీఘాట్, పుష్కరఘాట్‌లు, పడవ రేవులు పూర్తిగా బురదతో నిండి ఉన్నాయి. రాకపోకలు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

10 రోజుల పాటు రెండు పర్యాయాలు వరద తాకిడితో గోదావరి పరివాహక ప్రాంత ప్రజలు అల్లాడిపోయారు. మొదటి దశలో కొద్దిపాటి ఇబ్బందులు పడినా, రెండో సారి గోదావరి ఉగ్రరూపం దాల్చడంతో ఆచంట మండలం పెదమల్లం లంక, అయోధ్యలంక, పుచ్చల్లంక, మర్రిమూల, నేతలవారి పేట, పెదపేట, పల్లెపాలెం, భీమలాపురంల్లోని కాపుల పాలేల్లో వరద నీరు రోడ్లపై ఉధృతంగా ప్రవహించింది. కొన్ని చోట్ల నివాస ప్రాంతాలను వరద నీరు ముంచేత్తింది. సిద్ధాంతంలో మధ్యస్థ లంకలో లంక భూములు వరద తాకిడికి గురయ్యాయి. కేదారీఘాట్ రెండు రోజుల పాటు వరద నీటితో నిండి ఉంది. ఈ వరద నెమ్మదిగా తగ్గడంతో ఆయా ప్రాంతాల్లో బురద మిగిలింది. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వరద తగ్గడంతో అధికారులు ఊపిరి పీల్చుకొని వారివారి ప్రాంతాలకు వెళ్లిపోయారు. బురద కష్టాలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఆచంట మండలం పుచ్చల్లంకలో రోడ్డుపై నిలిచిన బురద →



### కనకాయలంక కాజ్‌వేపై రాకపోకలు

యలమంచిలి: ఎట్టకేలకు 13 రోజుల తరువాత కనకాయలంక కాజ్ వేపై వరద నీరు తగ్గింది. అధిక వర్షాల వల్ల గోదావరి పోటెత్తడంతో గత నెల 22న కనకాయలంక వద్ద కాజ్ వే మునిగింది. నాటి నుంచి ప్రజలు పడవల పైనే రాకపోకలు సాగిస్తున్నారు. మూడు రోజుల క్రితమే గోదావరిలో వరద తగ్గినా నీటి ఉధృతి తగ్గకపోవడంతో కాజ్ వేపై సుమారు మూడ అడుగుల మేర నీరు ప్రవహించేది. శనివారం కాజ్ వేపై నీటి ప్రవాహం తగ్గి కుందులు బయటపడ్డాయి. సుమారు అరడుగు మేర నీరు ప్రవహిస్తోంది. దీంతో కనకాయలంక ప్రజలు కాజ్ వేపై రాకపోకలను పున ప్రారంభించారు. కాజ్ వేపై ఆదివారం ఉదయానికి వరద నీరు పూర్తిగా తగ్గిపోతుందని అధికారులు భావిస్తున్నారు.



కనకాయలంక వద్ద కాజ్‌వేపై రాకపోకలు సాగిస్తున్న గ్రామస్తులు



సిద్ధాంతం పుష్కర రేవులో బురద



సిద్ధాంతం కేదారీఘాట్‌లో బురద



కోడేరు గోదావరి రేవులో నిలిచిన బురద

### కేరళ బాధితులకు విరాళాల సేకరణ



ఆచంటలో విరాళాలు సేకరిస్తున్న నాయకులు

పెనుగొండ: విపత్తు వేళ కేరళలోని వయనాడ్‌కు ప్రజలంతా అండగా నిలవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కేతా గోపాలన్ విజ్ఞప్తి చేశారు. శనివారం ఆచంట పరిసర ప్రాంతాల్లో కేరళ వరద బాధితులకు సీపీఎం ఆధ్వర్యంలో విరాళాలు సేకరించారు. రూ.10,502 విరాళాలు వచ్చినట్టు గోపాలన్ తెలిపారు. నాయకులు సిర్రా నరసింహమూర్తి, ఎస్‌వీఎస్ శర్మ, పి.మోహన్‌రావు, కుసుమే జయరాజు, తలుపూరి బుల్లాబ్బాయి, తోటపల్లి సత్యనారాయణ, కొండేటి సత్యనారాయ ణ, బండి రంగారావు, చదలవాడ చంటిబాబు, ఉన్న మట్ల పద్మారావు, చొప్పల మోహన్‌లు పాల్గొన్నారు.

● పెనుగొండలో సీపీఎం ఆధ్వర్యంలో కేరళ బాధితులకు రూ.5510 విరాళాలు సేకరించారు. సీపీఎం నాయకులు కేతా గోపాలన్, ఎస్ వెంకటేశ్వరరావు, షేక్ పాదుషా, కడిమి పెళ్లికొడుకు, నాగిశెట్టి గంగారావు, మాదాసు నాగేశ్వరరావు, శీలంయేసు, తోట నాగేశ్వరరావు, నీలాపు ఆదినారాయణ పాల్గొన్నారు.

### భగవద్గీత పారాయణం

భీమవరం: భీమవరం చిన్మయమిషన్ ఆధ్వర్యంలో ఆర్యవైశ్య వర్తక సంఘ భవనంలో శనివారం ప్రపంచ చిన్మయమిషన్ వ్యవస్థాపకుడు గురుదేవులు స్వామి చిన్మయనంద 31వ ఆరాధన శుభదినం సందర్భంగా గురుదేవుల పాదుక పూజ, సామూహిక సంపూర్ణ భగవద్గీత పారాయణం నిర్వహించారు.

# బిడ్డకు తల్లిపాలు శ్రేష్టం



పాలకొల్లు : అరట్లకట్టలో తల్లిపాల విశిష్టతను వివరిస్తున్న సత్యవేణి



పెనుమంట్ర : తల్లిపాల వారోత్సవంలో మాట్లాడుతున్న సర్పంచ్ ప్రియాంక

పాలకొల్లు అర్బన్: బిడ్డలకు తల్లిపాలు పట్టించడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పులఖండం సత్యవేణి అన్నారు. పాలకొల్లు మండలం అరట్లకట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సీడీపీవో సీహెచ్ ఇందిర ఆదేశాల మేరకు శనివారం బాలింతలకు, గర్భిణులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అలాగే మిషన్ శక్తి 100 కార్యక్రమంలో భాగంగా కిషోర బాలికలకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు చట్ట విరుద్ధమన్నారు. బాలికలను ఎవరైనా లైంగిక వేధింపులకు గుర్తి చేస్తే తక్షణం పోలీసులకు సమాచారం అందించాలన్నారు. హైస్కూల్ హెచ్‌ఎం మూర్తిరాజు, వన్ స్టాప్ సెంటర్ లీగల్ అడ్వైజర్ పసుపులేటి దుర్గ, ఏఎన్‌ఎం టి.రూపాదేవి, అంగన్‌వాడీ టీచర్లు కె.సత్యవతి, బి.లీలాకుమారి, ఎస్ భవాని, ఎ.రత్నమ్మ, సీహెచ్ సుబ్బలక్ష్మి, ఆశ వర్కర్లు, ఆయాలు పాల్గొన్నారు.

● దిగమర్రులో సర్పంచ్ రాపాక నగేష్‌కరుణాకర్ మాట్లాడుతూ చంటి పిల్లలకు తల్లిపాలు సంజీవినిలా పనిచేస్తాయన్నారు. ఉపసర్పంచ్ కొండేటి మల్లికార్జునరావు, ఏఎన్‌ఎం రమణమ్మ, సీహెచ్‌ఓ రోజా, అంగన్‌వాడీ టీచర్లు చిట్టి సుజాత, తులసి తదితరులు పాల్గొన్నారు.

**తల్లిపాలు శ్రేష్టదాయకం**

నరసాపురం రూరల్: పుట్టిన బిడ్డకు తల్లిపాలు శ్రేష్టదాయకమని గ్రామ సర్పంచ్ తాడి లక్ష్మీనారాయణ, ఎంపీటీసీ నక్కా లక్ష్మీనారాయణలు పేర్కొన్నారు. మండలంలోని చిట్టవరం అంగన్‌వాడీ మెయిన్ కేంద్రంలో వారు మాట్లాడుతూ పుట్టిన గంటలోపు బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో తల్లులు, ఏఎన్‌ఎం, సీహెచ్‌ఓ, ఆశావర్కర్ తదితరులు పాల్గొన్నారు.

**తల్లిపాల వారోత్సవాలు**

పెనుగొండ: తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శనివారం నడిపూడి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పించారు. సర్పంచ్ కడలి బేబీ అన్న పూర్ణ మాట్లాడారు. ఐసీడీఎస్ సూపర్‌వైజరు రూత్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

● ఆచంట కొరుపాలెంలో తల్లిపాల వారోత్సవాల ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ జిల్లా ఉపాధ్యక్షురాలు వైట్ల ఉషారాణి, ఆశావర్కరు పెచ్చెటి మాసేనమ్మ, బాలింతలు, కిషోర్ బాలికలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

**అమ్మపాలు బిడ్డకు ఆరోగ్య ప్రదాయిని**

పెనుమంట్ర: అమ్మపాలు బిడ్డకు ఆరోగ్య ప్రధాయిని అని పెనుమంట్ర సర్పంచ్ తాడిపర్తి ప్రియాంక అన్నారు. పెనుమంట్రలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఐసీడీఎస్ పీఓ ఎ.కృష్ణకుమారి మాట్లాడుతూ బిడ్డకు ముర్రుపాలు మొదటి టీకాగా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పి.వరలక్ష్మి వైద్య ఆరోగ్యశాఖ, అంగన్‌వాడీ సిబ్బంది తల్లులు పాల్గొన్నారు.

**తల్లి పాలతో బిడ్డకు ఆరోగ్యం**

మొగల్తూరు: బిడ్డ పుట్టిన గంటలోనే తల్లి పాలు పట్టిస్తే ఆరోగ్యంగా ఉంటారని ఏఎన్‌ఎం సావిత్రి అన్నారు. మొగల్తూరు 3వ సచివాలయం పరిధిలోని పెద్దపల్లవపాలెంలో మొగల్తూరు ఆసుపత్రి సిబ్బంది అవగాహనా సదస్సు నిర్వహించారు. సీడీపీఓ బి.ఊర్మిల, ఆసుపత్రి సిబ్బంది వి.సునీత, దివ్యశ్రీ, కె.సాంబశివరావు, బి.కృష్ణవేణి, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థినులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ

యలమంచిలి: యలమంచిలి జూనియర్ కళాశాలలో చదువుకుని గతేడాది బైపీసీ, ఎంపీసీ, సీఈసీ గ్రూపులో టాపర్‌లుగా నిలిచిన విద్యార్థినులకు శనివారం కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ తాళ్లూరి సూర్యప్రసాద్ స్కాలర్‌షిప్ చెక్కులను అందజేశారు. రాపాక శ్రీలేఖ (బైపీసీ) తోట నందిని సత్యశ్రీ (ఎంపీసీ) తెన్నేటి వైశాలి (సీఈసీ)లకు ఒక్కొక్కరికి రూ.25 వేలు చొప్పున చెక్కులను అందజేశారు. స్కాలర్‌షిప్‌లు అందుకున్న విద్యార్థినులు డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసన్ ఏం చదువుకున్నా మళ్లీ 60 శాతం మార్కులు సాధిస్తే మరో రూ.25 వేలు అందజేస్తామని సూర్యప్రసాద్ తెలిపారు. ఎన్ఆర్ఐ డాక్టర్ తాళ్లూరి సీతాదేవి కళాశాలలో చదువుతున్న విద్యార్థులను ప్రోత్సాహించేందుకు తన తండ్రి తాళ్లూరి వెంకట నారాయణ పేరిట రూ.38 లక్షలు బ్యాంకులో డిపాజిట్ చేశారని చెప్పారు. దీనిపై వచ్చే వడ్డీతో ఏటా విద్యార్థులకు ఈ నగదు ప్రోత్సాహకం అందిస్తున్నామన్నారు. అనంతరం ఇంటర్ విద్యార్థులకు ప్రభుత్వం నుంచి వచ్చిన పాఠ్య, నోటు పుస్తకాలను అందజేశారు. ప్రిన్సిపాల్ ఐ.నాగజ్యోతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ బర్రే మేరీ ప్రసాద్, ఎంపీటీసీ చిలుకూరి రాజ్యలక్ష్మి శ్రీనివాస్, కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులు యలమంచిలి సత్యనారాయణమూర్తి, బొప్పన హరికిషోర్ తదితరులు పాల్గొన్నారు.



స్కాలర్‌షిప్‌లు అందుకున్న విద్యార్థినులు

### ఆన్‌లైన్ ద్వారా కేసుల రాజీకి వెసులుబాటు

నరసాపురం: అత్యవసర పరిస్థితుల్లో కోర్టుకు హాజరుకాలేని వారు ఆన్‌లైన్‌లో దగ్గరలోని కోర్టుల ద్వారా అదాలత్‌లో కేసులు పరిష్కరించకునే వెలుసుబాటు ఉందని నరసాపురం సీనియర్ సివిల్‌జడ్జి జి.గంగరాజు తెలిపారు. సెప్టెంబర్ 14న నిర్వహించే జాతీయ లోక్ అధాలత్ నిర్వహణపై శనివారం కోర్టుహాల్‌లో పోలీసు అధికారులతో ఆయన సమీక్షా సమవేశం నిర్వహించారు. జాతీయలోక్ అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా పోలీసు అధికారులు సహకరించాలని కోరారు. అపరిష్కృతంగా ఉన్న కేసులు రాజీ ద్వారా కలిగే ప్రయోజనాలను కక్షిదారులకు వివరించాలన్నారు. లోక్ అదాలత్‌లో పెద్ద ఎత్తున కేసులు రాజీ అవుతున్నాయని, రాజీ చేసుకోదగ్గ అన్ని క్రిమినల్, సివిల్, చెక్‌బౌన్స్ కేసులు పరిష్కరించుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సవిల్‌జడ్జి ఆర్ వరలక్ష్మి, అదనపు సివిల్ జడ్జి కె.శ్రీనివాస్, నరసాపురం టౌన్ సీఐ కేవీ స్వామి, రూరల్ సీఐ కె.గోవిందరాజులు, ఎస్సైలు కె.గురవయ్య, ఎస్ఐకే రమణ, ఉదయభాస్కర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి గంగరాజు

### అవయవాలు దానం చేయండి

ఉండి: అవయవాల దానం మహత్కార్యమని మండల మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ మండలాధ్యక్ష కార్యదర్శులు పెన్మత్స రామకృష్ణంరాజు, గాదిరాజు రంగరాజు అన్నారు. శనివారం మండలంలోని కలసిపూడిలో ప్రపంచ అవయవ దాన అవగాహన దినోత్సవాన్ని స్థానిక హెచ్‌ఎం ముదునూరి సుధారాణి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో మానవతా నాయకులు మాట్లాడుతూ మనం మన జీవితాన్ని ముగించకముందే మరొకరికి అవయవాలు దానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. దీనిపై ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కో చైర్మన్ దంగేటి రామలింగేశ్వరరావు, పలువురు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### సుప్రీం కోర్టు తీర్పు హర్షణీయం

మొగల్తూరు: మూడు దశాబ్దాల మాదిగ ఉపకులాల వర్గీకరణ పోరాటం కారణంగా దేశ అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు హర్షణీయమని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కోడెల్లి వెంకట్రావు శనివారం పేర్కొన్నారు. ఏబీసీడీ వర్గీకరణ కారణంగా రేపటి తరం పిల్లలకు మంచి భవిష్యత్ ఉంటుందని తెలిపారు.

### కళాశాలను సందర్శించిన ఆర్‌జేడీ



కళాశాల మ్యాగ్జైన్‌ను విడుదల చేస్తున్న ఆర్‌జేడీ శోభారాణి

పాలకొల్లు సెంట్రల్: పర్యావరణం పచ్చగా ఉంటే అందరూ ఆరోగ్యంగా ఉంటారని రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఎస్ శోభారాణి అన్నారు. శనివారం స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించి కళాశాల మ్యాగ్జైన్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా శోభారాణి మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి పలు సూచనలు చేశారు. కళాశాల ఆవరణలో మొక్కలను పెంచాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ టి.రాజరాజేశ్వరి, వైస్ ప్రిన్సిపాల్ టి.కృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### అవయవదానం పవిత్ర కార్యం



అవయవదానం ప్రాముఖ్యతను వివరిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

యలమంచిలి: అవయవదానమనేది ఒక పవిత్ర కార్యమని జిల్లా బాలల సంరక్షణ అధికారి ఆర్ రాజేష్ అన్నారు. జిల్లా మహిళ శిశు సంక్షేమ సాధికార అధికారి కార్యాలయం సూచనల మేరకు ఇండియన్ ఆర్గన్ డొనేషన్ డే కార్యక్రమాన్ని శనివారం మేడపాడు సీఎంఎస్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో రాజేష్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన తరువాత ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ అవయవదానం చేయవచ్చునన్నారు. ఐసీడీఎస్ సీడీపీఓ సీహెచ్ ఇందిర మాట్లాడుతూ ఒక మనిషి మరణించిన తరువాత శరీర భాగాలను దానం చేయడం వల్ల మరో జీవితంలో వెలుగులు నింపే అవకాశం ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహ్మద్ హసీనా, ప్రాజెక్ట్ ఇన్‌చార్జి పి.మమతాశ్రీ, ఓఆర్‌డబ్ల్యు పి.వెంకటేష్, సీఎంఎస్ వార్డెన్ పి.జ్ఞానప్రకాష్ అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

### వేములదీవి వెంకన్నకు ప్రత్యేక పూజలు



నరసాపురం రూరల్: మండలంలోని వేములదీవి గ్రామం కాపులకొడపలో వేంచేసిఉన్న వెంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. ప్రత్యేక పూజలు చేశారు. తలనీలాలను సమర్పించుకున్నారు. స్వామివారికి ఏడు వారాల ప్రదక్షిణలు చేశారు. అన్న ప్రసాదం స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.